# దర్గామిట్ట కతలు

మూషిక వాహన మోదక హస్త
చామరకర్ణ విలంబిత సూత్ర
వామనరూప మహేశ్వర పుత్ర
విఘ్న వినాయక పాదనమస్తే!...

యిదీ మా యిద్యానికేతన్ కాన్మెంట్‌లో ప్రార్దన.

యీ మాత్రను సంబడం చేయించడానికి మా అయిదో కిలాస్‌లోని గోదాలక్ష్మి పొట్టి ముండ అర్కాట్ కళావాణీ ఎన్నెన్ని శకలు పడేవాళ్లో తెలుసునా?

గొంతు సన్నంగా బెట్టి, నోరు దెరిస్తే నవర్లకు నవర్ల బంగారం రాలిపడిపోద్దేమో అన్నట్టు వొయ్యారంగా ఒకో లైను జెప్పడం- వంత పాడతన్న మా అంద రికల్లా బెట్టుసరిగా చూడటం, దీర్గందీసి యింకో లైను జెప్పడం- చూసినారా మేమెంత క్లవర్లమో అన్నట్టు ముసిముసిగా నవ్వడం- యిదే దరువు.

వాళ్ల మిడియాలం చూస్తా వుంటే నా కడుపు కాలిపోతా వుండేది. దేవుడు యీ మాదిరి గొంతు నాగ్గూడా యిచ్చినాడు గదా-. యీ ప్రార్దన నేను మాత్రం జేయించలేనా అని బాదపడని రోజులా.

కానీ ఎవురితో జెప్పకునేది?

ఇస్కూలు హెడ్డు రమాదేవి టీచర్‌కీ, ఇంగిలీషు జెప్పే శశిప్రబ టీచర్‌కీ నేను ఇస్కూలికి నక్కరంగా రానని పీకల్దాకా: కోపం. లెక్కలు జెప్పే మాల్యా ద్రియినోరికయితే ఏకంగా పగే. ఒంగోబెట్టి యీపు మింద పెంచటాలు, బాగాహారాలు చేయించడానికి తప్పితే ఆయన యింకోపనికి మనదెగ్గిర రానుగాక రాదు.

పోషలుజెప్పే రుక్మిణి టీచరు దెగ్గిర రొంత చనువుందిగానీ ఆమెకు నా చేత ప్రార్దన చేయించమని జెప్పే అదాట్టీ లా.

అందుకే కడుపులో బాద కడుపులోనే బెట్టుకొని 'ఏనాటికైనా నేనుగూడా ప్రార్దన చేయిస్తా చూస్తుండండి లమిడీ ముండల్లాలా' అనుకుంటా వుండేవాణ్ణి. ఆ రోజుగూడా అట్టే అనుకుంటా ప్రార్దనయ్యాక కిలాసులోకి ఎల్లి కూచుంటే అయిదు నిమిషాల్లో చెవ్వలాడించుకుంటా రమాదేవి టీచరొచ్చింది.

'యియ్యాల కిలాస్ లా. నాకు యానివసరీడే పనుంది. మీరంతా పుస్తకాలు తీసి చదవతా కూచోండి. శబ్దమొచ్చిందంటే చెమ్డాలు తీస్తా' అని బెత్తం ఆడించింది.

తర్వాత అందరి తట్టు జూస్తా 'మీలో యాక్షను జేసే యింటరెస్టున్నోళ్లంతా లేసి నిలబడండి' అంది.

ఆ మాటామె అన్నదే తడవు మురళీగాడూ కిషన్ కిషోర్‌గాడూ కందుల మాలకొండరావుగాడూ గోదా లక్ష్మి పార్వతి (యీళ్లంతా మా కిలాస్‌లో క్లవర్లు. ఏ పనైనా యీళ్లు మాత్రమే చేయగలరని మా టీచరు నమ్మకం) టకటకా లేచి నిలబడిపొయ్యారు.

నా గుండె గుబగుబలాడింది.

మన సత్తవ చూపించాలంటే యిదే చాన్సనుకొని నేను గూడా లేచా.

నన్ను చూడ్డంతోటే రమాదేవి టీచరు నవ్వుమొకం పెట్టింది.

'నీకు తెలుగేమి వచ్చురా నీకే నాక్, మాకే మీకే ముండా? ఇస్కూలికి సరిగా రారా నాయినా అంటే రాడుగానీ అయ్యకి డ్రామాలుగావాల్సొచ్చాయే' అంది నవ్వతా.(అగస్టు పదిహేనుకి రంగు కాయితాలు కడతా 'పురికోన యిరగ్గొట్టేదా టీచర్' అని అడిగినప్పటి మంచి ఆమెకి నా తెలుగు బాషంటే తమాషా). నేను మొకం చిన్నంగా పెట్టుకొని కూచునేశా. కిలాసంతా గొల్లున నవ్వేసింది.

మా నాయిన్ను ఏం జేసినా పాపంలా), చెడ్డీలు ఎనక చిరిగిపోతే లోపల్నించి మడిచి పిన్నీసులు బెట్టుకుంటావనీ ( కుట్టడానికి దారం దొరక్కపోతే టెంపరరీగా మా నాయినమ్మ చేసేదట్టా), నీళ్లు బోసుకొని శుబ్బరంగా వుండవనీ (మా యింట్లో పొద్దునపూట స్నానాల్లా. సాయింత్రమే) వాళ్లందరికీ చిన్నచూపు.

హోమ్‌వర్కు చేయక, క్యారేజీ రెడీగాక (రెడీగాకా పొడా ? వొండక) ఇస్కూలు ఎగమాకినందుకు 'బడికిరాని మొద్దు - చదవురాని ఎద్దు' అనే ఎక్కిరింపు సరేసరి.

## మా ఇస్కూలు యానోసిరికి దుమ్ము లేపేసినా!




**గోర అవమానం!**

పోయ్నేడు నాలుగో కిలాస్‌లో గూడా యిదే అవమానం!

యానివసరీ డేకి క్లవర్ల చేత నాటకాలేయించడం, రిహార్సల్‌కని వాళ్లకు మాత్రం పొద్దున రొండు సాయింత్రం రొండు హాయిగా కిలాసులు ఎగమాకించడం, మా బోటి మొద్దులందర్నీ కూచోబెట్టి పాదిపాది చదివిస్తా వుండడం- కొత్తయితే గదా.

మొద్దుల్లో మిగలినోళ్ల సంగతన్నా కాస్త నయింగాని నా బతుకు మరీ హీనం.

మా కిలాస్‌లో క్లవర్లు ఎట్టా నాతో మాట్లాడక పోయినా మొద్దునాకొడుకుల్లో గూడా సగంమంది మాట్లాడేవారు కాదు. ఇస్కూలిడిచినాక తోడు వడిచేవారు గాదు. పైగా కిండల్ జేస్తాపోయేవారు.

మడతలు పడి- నల్లంగ మాసిపోయిన యూనిఫారమ్ ఏసుకొస్తావనీ (మూడు నెల్లు పంతంబట్టినా రొండు జతల యూనిఫారమ్ కుట్టించలాకపోయిన

వాళ్లెట్ట జూసినా నేను అయితేమందిలే అనుకుంటా వుండేవాణ్ణిగానీ ఆరోజు రమాదేవి టీచరు చేసిన అవమానానికి మాత్రం మండిపొయ్యింది.

తెలుగు రాకపోతే నాదా తప్పా? అది మా యింట్లో బాషగాదు, మా కసాబ్‌గల్లీ బాషగూడా గాదు. అప్పటికీ ఇస్కూల్లో అందరిలా ఇంగిలీషు, తెలుగు చదవడం రాయడం నేర్చుకుంటానే ఎగస్ట్రాగా తెలుగు మాట్లాడటంగూడా నేర్చుకుంటున్నా మా రమాదేవి టీచరు రొంత కనికరించనందుకు బాదేసింది.

ఆ రోజు రాత్రి మా నాయినమ్మ పక్కలో పొణుకొని అంతా జెప్పకొన్నా. మా నాయినమ్మ 'ఆ లంజకి మన బాష వొచ్చంటనా నీకు తెలుగురానడానికా? పూరుకోరా అయ్యా' అని రమాదేవి టీచర్‌ని తిడతా నన్ను గట్టిగా పొదుగుకునింది.

(మిగతా పక్కపేజీలో)